కథ

# ?




## టి. సంపత్‌కుమార్

"జాగ్రత్తగా వినండి. యాదగిరి చెప్పింది నిజమే. పనుల్లోంచి తిరిగి వచ్చేటపుడు మేము వెళ్ళి చూసొచ్చాం. వేరేవాళ్లు వెళ్ళకముందే మనమెళ్ళాలి. ఆలస్యం చెయ్యొద్దు. రోజుకు వందల కుటుంబాలు వస్తుంటాయి ఈ పట్టణానికి... లెక్కించాం. అరవై ఎనిమిది ఉన్నాయి. ఇంకా వస్తాయో రావో తెలియదు. వస్తే మంచిది. మన కుటుంబాలేమో వందకు పైగా... ఏం చేద్దామంటారు?" అందరిని ఉద్దేశించి నర్సయ్య అన్నాడు.

"అడగడానికేముంది దీంట్లో... ప్రతినెలా రెండుమూడు కుటుంబాలు ఇక్కడికి వస్తున్నాయి. ఇరకాటం ఎక్కువవుతుంది. ఖాళీ స్థలం లేకుండా పోయింది. పాకలన్నీ ఒకదాంతో మరొకటి అతుక్కొని ఉన్నాయి. పార్కువాళ్ళు రోజూ గొడవ పెడుతున్నారు. పార్కు బయటున్న కుటుంబాలకి మరీ కష్టంగా ఉంది. కుక్కల్తో, పందుల్తో, ఎలుకల్తో ఇబ్బందులు పడుతున్నారు. మొదలు వారిని పంపిద్దాం. మనకి పార్కులో నాలుగు దిక్కులా గోడలున్నాయి. దినంపూట పెద్ద మనుషులున్నారు. మనం పనులకెళ్ళినా చింత లేకుండా ఉంటున్నాం". కాంతమ్మ సజావుగా నలుగురికి మేలు చేసే ఉద్దేశ్యంతో అంది.

వీరయ్య భగ్గున లేచాడు. "భలే చెబుతున్నావు కాంతమ్మ. మొన్న మొన్న వచ్చిన వాళ్ళపై అంత ప్రేమ పుట్టుకొచ్చిందా నీకు. పార్కులో ఉన్నామే కాని ఏం సుఖాలు మనవి? ఎండాకులు, ప్లాస్టిక్ శీట్లతో కప్పు, అట్టలతో, చిలుముపట్టిన రంధ్రాల రేకులతో మన గుడిసెలు. గాలివీస్తే లేచిపోతాయి. వాన వస్తే తడిచిపోతాయి. వర్షాకాలం కష్టాలు గుర్తుకు తెచ్చుకో... ఆ కష్టాలన్నింటిని అప్పుడే మరచిపోయావా? నేనొప్పుకోను... ఒక్కొక్కరం ఇక్కడికి చేరుకొన్నాం. ఇప్పుడు వందకు పైగా కుటుంబాలు. మురికివాడల్లో పిరికిగా బతుకుతున్నాం. మొదటొచ్చిన వాళ్ళకి అవకాశం ఇవ్వాలి, అంటే సీనియారిటి... వాళ్ళే మొదట అక్కడికెళితే మంచిది.... వాళ్ళే వెళ్ళాలి.." ఖచ్చితంగా చెప్పాడు....

భోజనాలయ్యాక తీరుబడిగా కూర్చున్నారు. తెల్లారి పనులకు సెలవు. దూరంగా ఉన్న వీధిలైట్లు పేదవారి సంక్షేమ పథకాల్లా గుడ్డిగా వెలుతురును చిమ్ముతున్నాయి. మొహాలు స్పష్టంగా కనబడడం లేదు. అయినా మాట్లాడేటప్పుడు గొంతుతో ఎవరెక్కడ కూచున్నారో అందరూ గుర్తుపడతారు. సుమారుగా ఆడా - మగా కలిసి ఎనభైవరకు కూచున్నారు. ఓపిగ్గా మాటల్ని వింటున్నారు. దినమంతా కష్టపడి వచ్చారు. కొందరు కునుకుతున్నారు. పిల్లల అరుపులు,

ముసలివాళ్ళ దగ్గులు, దమ్ము లాగినపుడల్లా బీడీల చివర్లు ఎరుపురంగులో మెరుస్తూ చల్లబడుతున్నాయి. ఆడవారు తమలపాకుల్ని తాపీగా నములుతున్నారు. కాంతమ్మకూ ఇదో బలహీనత. ఎప్పుడూ ఆకు నోట్లో ఉండాల్సిందే. ఆకుని మడతపెట్టి నోట్లో వేసుకొన్నాక అది పండించే ఎరుపురంగుని చూస్తుంటే ఆమెకు ఎక్కడ లేని ధైర్యం వస్తుంటుంది.

వీరయ్యని సమర్థిస్తూ రాములు, భూమన్న, వెంకటేశం, ఇంకా కొందరు తమకు తోచిన మాటల్లోఅన్నారు... మల్లక్క, లచ్చి.... మరికొందరూ మాట కలిపారు. వాళ్ళందరికి కొత్తచోటికెళితే కష్టాలు తగ్గుతాయన్న ఆశ.

కాంతమ్మ నోట్లో నిండిన ఉమ్మిని ఓ ప్రక్కన విసిరింది. గొంతు సవరించుకొంది. "ఇపుడు మనకేం తక్కువైందిరా నర్సయ్యా... నాలుగైదు ఏళ్ళ నుండి అందరం కలిసుంటున్నాం. స్థానిక బలం మెల్లమెల్లగా పెరుగుతోంది. ఈ పార్కులో నల్లా ఉంది. నీవెపుడైనా ఓ బిందెడు నీళ్ళు మోసావురా? దినంపూట నీవు - నీ పెండ్లాం పనుల్లోకి పోతె పిల్లల్ని ఎవరు చూస్తున్నార్రా ? ఇక్కడుంటున్న వాళ్ళే కదరా.... మీరంతా తిరిగొచ్చేదాకా కుక్కలు, పందులు, పగటి దొంగలనుండి మీ పిల్లల్ని - మీ సామాన్లని కాపాడుతున్నది ఎవరనుకుంటున్నారా? మనమే ! ఒకరికొకరం తోడుంటున్నాం కదర్రా...." తనకంటె చిన్నోళ్ళందరిని 'రా' అని సంబోదిస్తుంది కాంతమ్మ. ఆమె లాజిగ్గా మాట్లాడుతుంది కావున ఆమె మాటలకి అందరూ విలువిస్తారు.

"కాంతక్కా, చూస్తున్నావు గదనే మనపాకలు. అదిగో... అటు చూడు... అక్కడి అపార్టుమెంటుల్లో ఉండేవాళ్లు పారేసిన వాటిని మనం, మన పోరలు పోటీపడి తెచ్చుకొని పాకలకి చుట్టుకొంటాం. ఐదుమీటర్ల ప్లాస్టిక్ పొరని తెచ్చి "కప్పు" అంటాం. ఏం బతుకులేమనవి ? ఓ రక్షణ లేదు - పాడు లేదు... ఈ రోజు వచ్చేటపుడు యాదగిరి, నేను, జంగన్న, ఇంకో ముగ్గురం వెళ్లి చూసొచ్చామే. సిమెంటు పైపులు. పెద్దగున్నాయి. మనిషి నడవచ్చు. మేమంతా పైపుల్లోంచి నడిచాం ! ఓ వైపు తడికనో, అట్టలో కట్టుకొని, ఇంకోవైపు రేకుల్నో, తట్టు సంచుల్నో, అట్టల్నో తడపులాగా పెట్టుకొంటే హాయిగా ఉండొచ్చే ! మనోళ్ళని చూడలేదా ?"

"అరె నర్సయ్యా... మనోళ్ళుంటున్న పైపుల కాలనీని నేను చూసానురా. దాని సంగతి వేరురా. గవర్నమెంటోళ్ళు పైపుల్ని వేసిపోయారు. కాని పని ఆగిపోయింది. పార్టీలు, ప్రభుత్వాలు మారాయి కాని ఆ పైపులు నీళ్ళు సరఫరా చేసే బదులు ఇళ్ళుగా మారాయిరా... పదేళ్ళ నుండి ఉంటున్నారు. అదృష్టం కొద్ది వాళ్ళకు అన్ని అందుబాటులో ఉన్నాయి. పిల్లల్ని కంటున్నారు. పెళ్ళిళ్ళవుతున్నాయి. ఇప్పుడు పైపుల మధ్య కొత్తపాకలు పుడుతున్నాయిరా....."

"ఇంతకు నువ్వు చెప్పే విషయం ఏంటే కాంతక్కా. నాకు అర్థం కాలేదే! కాస్త వివరంగా చెప్పవే !..."

"ఇవుడివుడే మనకు స్థానికబలం పెరుగుతుంది. ఆ ఎన్జీవో (వాలంటరీ ఆర్గనైజేషన్) వాళ్ళు మనదగ్గరకొస్తున్నారు. పిల్లలకు చదువు చెబుతారట. మన పార్కులోనే స్కూలు పెడతారట. రేషన్ కార్డుల గురించి అడిగాను. సహాయం చేస్తామన్నార్రా. ఇవన్ని జరుగుతుంటె ఇపుడు పార్కు వదిలి, ఆ పైపుల్లోకి వెళ్ళొద్దురా. ఇక్కడ భూమితో బంధం ఉందిరా. పైపుల్లో అది ఉండదురా. నలుగురు చెయ్యేస్తే దొర్లుకుపోయే పైపుల్లో నిలకడలేదురా...."

"వర్షాకాలంలో చూసావు కదే. కాంతక్క పాకల్ని వదిలి నీళ్ళ టాంకు కిందకు వెళ్ళి గడిపాం. బట్టలు, సామాన్లు అన్ని తడిసి పాడయ్యాయి. వర్షాకాలం వచ్చిందంటే దడదడ. మన పిల్లలు చదివి ఏం చేస్తారే అక్కా. అదే కూలిపనికదా. తాగేనీళ్ళు అందరికీ శాపమే. బిల్డింగుల్లో ఉన్నవాళ్ళకూ తిప్పలే! మనకీ తప్పవు తిప్పలు. ఆ కష్టాలు ఒకనాడు తీరేవి కాదు. కష్టాలేవో మేం పడతాం. పైపుల్లోకి పోదామే. ఈ పాకలకంటే పైపులు మనల్ని బాగా రక్షిస్తాయి..." అంది మల్లక్క.

"మల్లక్కా... నర్సయ్యా....ఓ మాట చెప్పండి. ఈ పైపుల్లో ఎన్ని సంవత్సరాలు ఉంటా మనుకొంటున్నారు? ఊర్లు వదిలి వచ్చాం. ఇక్కడ కలుసుకొన్నాం. ఓ బంధం ఏర్పడింది మనలో. కలిసి బతుకుతున్నాం. ఈ పాడు బడ్డ పార్కులో కాలు మోపేందుకు అందరికి స్థలం దొరికింది..." కాంతమ్మ సూటిగా అడిగింది.

"గవర్నమెంటు పనులు నీకు తెలియనివి కాదే కాంతక్క ఏ పని సక్రమంగా జరిగింది? ఎంత లేకున్నా ఓనాలుగైదు సంవత్సరాలు పైపులు అలాగే పడి ఉంటాయి..." నర్సయ్య.

"అక్కడే నువ్వు పొరపాటుగా అర్థం చేసు కుంటున్నావురా. మొన్న ఎన్జీవోళ్ళు వచ్చినప్పుడు చెప్పారు. ఇదిమన పని కాదట్రా. ప్రపంచబ్యాంకోళ్ల ప్రాజెక్టట. పనులు వేగంగా జరిగిపోతాయట. ఏడాది లోపటె అయిపోతుందని అన్నారు. పైపుల్ని గుంతల్లో వేసి మట్టి కప్పేసాక ఎక్కడికి పోతార్రా" అని మందలించింది కాంతమ్మ.

"నీవు చెప్పింది బాగుందే కాంతక్క. నీకు తెలుసా అక్కా... ఇంకో ఆరునెలల్లో మన రాష్ట్రంలో ఎలక్షన్లు. ఇపుడున్న పార్టీ మళ్ళీ పరిపాలించేట్టు లేదు. ఈ పైపుల ప్రాజెక్టుకి అపోజిషనోళ్ళు ఒప్పుకోవడం

## దంతరాద్ధాంతం

ఎంత హాయి ఈ వాయి
దంత మూడిపోయి,
చిరకాలపు పంటిబాధ
చింతదీరెనోయి !

గారెలు నములంగ రాక
గాసి పడితినోయి !
బఠాణీల కఠోరతకు
బాధపడితినోయి !!

డెంటిస్టూ డోంటువర్రి
అంటూ ఒక పీకు పీకె -
భయమే లేకుండపోయి
నయము ఐనదోయి !

బ్రష్షు చేసుకొనెడు వేళ
డస్సి ఊడెనోయి !
తొస్సెనోరు అవుతుందని
ఉస్సురు మననోయి !!

వేదాంతుల కైనా మరి
సిద్ధాంతులకైనా సరె
'దంతవంత' సుంతయైన
రాద్ధాంతమెనోయి !

- దూడం నాంపల్లి

లేదు. ఎన్జీవోళ్ళు కూడా ఈ ప్రాజెక్టుకి తమ వ్యతిరేకతని తెలుపుతున్నారు. మన అదృష్టం బాగుండి కొత్త ప్రభుత్వం వస్తే ఓ ఐదు సంవత్సరాలవరకు పైపులు ఎక్కడికీ కదలవు. నా మాట వినవే అక్కా... అక్కడకి వెళ్ళిపోదామే కాంతక్క. ఇంకా పైపులు వేస్తుండవచ్చే. కుటుంబానికి రెండు పైపులు దొరికితే ఏంచక్కా ఉండొచ్చే. ప్రక్క ప్రక్క జరిపి పెట్టుకొంటె మనమూ ఆ అపార్టుమెంట్లల్లో ఉండేవాళ్ళలాగా 'టూ రూమ్స్' అని చెప్పుకోవచ్చే. వాళ్ళకి కింద భూమి లేదు – పైన ఆకాశం లేదు. మనకు ఆ రెండూ ఉంటాయి. సిమెంటు కప్పు ఉంటుంది. ముందు – వెనక ఖాళీ స్థలమూ ఉంటుంది. కావలసిన రీతిలో ఇళ్ళను అటు ఇటుగా కూడా జరుపుకోవచ్చు...." ఆశతో కలలు కంటూ కొండయ్య సంభాషణ మధ్యలో దూరాడు.

"మీ అందరికి ఏదో భూతం ఆవరించి నట్టుంది. పైపుల్లో పావులయ్యేందుకే ఇష్టంగా ఉన్నారు. ఇక్కడ చూడండిరా.... మేరేసుకున్నవి చిన్న పాకలే అయినా వాటికి కనీసం కొలతలున్నాయిరా. అడ్డం – నిలువు కొలవచ్చురా. నలుగురు చేతులేసి దొబ్బితే దొర్లుకుపోయే ఆ పైపుల్లో ఎలా బతుకుతార్రా? నాకు తోచిందేదో చెప్పానురా... మీ ఇష్టం... నేను మాత్రం ఇక్కడినుండి కదలనురా..." మళ్ళీ ఓసారి నోటినిండా ఊరిన ఎరుపు రంగులో ఉన్న ఉమ్మిని తుపుక్కున బయటికి ఉమ్మింది కాంతమ్మ.

రాత్రి పదకొండయ్యింది. అందరు ఎవరి పాకల్లోకి వారెళ్ళిపోయారు. కాంతమ్మ కూడ అసౌకర్యంగా పాకవైపు కదిలింది. చెంబుతో నీళ్ళు తీసుకొని పైనుండి నోట్లో పోసుకొని బాగా పుక్కిలించి బయటికి చిమ్మింది. ఎరుపురంగు పలచబడింది. మరికొన్ని నీళ్ళతో మరోసారి పుక్కిలించి నోట్లోనుండి వీలయినంత వరకు ఎరుపు రంగును తీసేసింది. పడుకునే ముందు కాంతమ్మ రోజూ చేసే పని అది.

✿ ✿ ✿

గాఢనిద్రలో ఉన్న కాంతమ్మకి ఏదో అలికిడి, మనుషులు కదులుతున్న హడావుడితో మెలకువ వచ్చింది. సామాన్ల కదలికల శబ్దాలు. తొందర పెడుతున్న అరుపులు, సంభాషణలు వినబడుతున్నాయి. నిద్రమబ్బు వీడినకొద్దీ అన్నీ స్పష్టంగా వినబడుతున్నాయి. బయటిపరిస్థితి ఏంటో కాంతమ్మ అంచనా వేయగలిగింది. మనస్సులో బాధ. మెల్లగా లేచి తుప్పుపట్టిన రేకుతో చేసిన తలుపుని తెరిచి బయటకు అడుగు పెట్టింది.

వీధి స్తంభపు లైటు విసురుతున్న పేద కిరణాలు మురికివాడల ఇళ్ళని ఆవరించి ఉన్న చీకట్లని పారదోలలేక పోతున్నాయి. దళారుల్లా మధ్యలో చెట్లు–ఆకులు వెలుతురు దోచుకుంటున్నాయి. అందరికి అందేట్టుగా గాలికి కొమ్మలు రెమ్మలు కదులుతూ వెలుతురుని చీకటి ప్రాంతాలకు అందిస్తుంది. మేమున్నామంటూ పాకల్లో నూనె దీపాలు తమవంతు సేవలని అందిస్తున్నాయి.

కొందరికి ఆ పార్కులో ఆఖరిరాత్రి. మరికొందరికి మరో రాత్రి.

పార్కు బయట రిక్షాలు, ఆటోలు రెండు టెంపోలున్నాయి. సామాన్లు నిండుతున్నాయి. రిక్షాలు లాగే వాళ్ళు తమవంతు సహాయం చేస్తున్నారు. ఆటో, టెంపోలడ్రైవర్లు ఓచోట నిల్చోని బీడీలు తాగుతూ రాజకీయాల్ని మాట్లాడుతున్నారు.

కాంతమ్మ మెల్లగా, చుట్టుతా గమనిస్తూ టెంపోల వైపు నడిచింది.

"కాంతక్క.... ఏమనుకోకే.... ఇక మా బస పైపుల్లోనే... అందరూ అందులోనే ఉండేందుకు ఇష్టపడుతున్నారే... ఓ ముప్పై కుటుంబాలు ఇక్కడే ఉంటాయట. నీకు తోడుగా ఉంటారు లేవే ! ఇన్నేళ్ళు మనమంతా బాగా కలిసి బతికినామే.... నువ్వూ రావే.... నీకో పైపు చాలు...." భూమన్న టెంపోలో సామాన్లని సర్దుతూ బతిమాలుతూ అన్నాడు.

"మీకంత ఇష్టంగా ఉంటే నేనెలా ఆపుతానురా భూమన్నా... మీ భార్యలకి, మీకూ అక్కడే మేలనిపిస్తే వెళ్ళండి... సుఖంగా ఉండండి. పెద్దదాన్ని కాబట్టి నాలుగు మంచి మాటలు చెప్పాను. భూమిలోంచి పీకిన మొక్కల్ని కుండీల్లోకి మార్చుతున్నార్రా... మీ ప్రపంచాన్ని మరీ చిన్నదిగా చేసుకొంటున్నార్రా... ఇక్కడ ఇపుడిపుడే మనకు స్థానిక బలం పెరుగుతుందిరా. ఎన్జీవో వాళ్ళతో మనకు చాలా మేలు జరగబోతుందిరా... అన్నింటిని మించి పిల్లలకి ఇక్కడే స్కూలు పెడుతున్నార్రా...." సాఫీగా మొదలైన మాటలు చివరికొచ్చేసరికి కోపాన్ని సంతరించుకొన్నాయి.

"పొండర్రా పోండి.. మీ ఇష్టం... మళ్ళెపుడు ఇటువైపు రాకండి." అని వెనక్కి తిరిగి, ఓ చోట రాయిపై కూచోని ఆలోచిస్తూ కూర్చొంది. బొడ్లోంచి చిన్న సంచి తీసి కిళ్ళీ చేసుకొని పాచినోట్లో పెట్టుకొంది.

ఉదయం నాలుగవుతోంది.... ఇంకో పదిహేను నిమిషాల్లో రిక్షాలు నడిపేవారి కాళ్ళు పెడల్లని గట్టిగా నొక్కాయి. వెనకతోపుతో ఒక్కసారే ముందుకు సాగాయి. డ్రైవర్లు ఆటోల్ని గుర్రుమనిపించారు. టెంపో డ్రైవర్లు తాళం చెవుల్ని తిప్పి ఇంజన్లని నిద్రలోంచి లేపారు. అన్నీ ఒకేవైపు... వేగాల్లో తేడాలున్న గమ్యస్థానమొక్కటే !.....

మిగిలి ఉన్న పెద్దలంతా విచారంగా కాంతమ్మచుట్టు చేరారు. మాటలు బలహీనంగా, పిరికిగా వస్తున్నాయి.



గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో గుంటూరు అన్నమయ్య కళావేదికపై జరిగిన ఆవిష్కరణ సభలో నాగిశెట్టి రచించిన 'మనిషికోసం' నానీల సంపుటిని ఆవిష్కరిస్తున్న ఆచార్య తేళ్ళ సత్యవతి. చిత్రంలో ప్రముఖ కవులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, ఎస్.ఆర్. భల్లం, డా॥ పి.వి.సుబ్బారావు, కోసూరి రవికుమార్, కవి నాగిశెట్టి, శ్రీమతి గద్దె రామతులశమ్మ, దాసరి చంద్రశేఖర్ ఉన్నారు.

కాంతమ్మ ఒక్కదూటున రాయిపైనుండి లేచింది "నాతో రండర్రా" అంటూ పార్కుకి కొంచెం దూరంలో ఉన్న పాకలవైపు దారి తీసింది.

బక్క చిక్కిన రిక్షాటైర్లు, మధ్యతరగతి లాంటి ఆటోచక్రాలు, బలిసిన బాపతు టెంపోటైర్లుముందుకు సాగిన పది నిమిషాల్లోనే పోలీసెదురైంది.

షరా మామూలే !....

'లోకం' తెలిసిన ఓ పదిమంది 'టీమ్ ఇండియా'గా మారి ఖాకీ – కర్ర పెట్టనంతో 'మృదు' సంభాషణ జరిపారు. మూడవ రెఫ్రీ లేకుండానే ముచ్చట్లు విజయవంతమయ్యాయి. ఈ తతంగమంతా అయ్యేసరికి చీకటి పల్చబడింది. వెలుతురు చిక్కబడింది.

అన్ని చక్రాలు చక్రాల ఆకారపు 'ఇళ్ళ' వైపు దారి తీసాయి. మరో లోకంలోకి అడుగుపెట్టబోతున్నందుకు అందరూ ఉత్సాహంతో ఉన్నారు. వారితోపాటు అప్పటికప్పుడే కట్టిన సామాన్ల ముల్లెలు, మూటలూ, పెట్టెలు, డబ్బాలు వాహనాల కదలికలతో ఊగుతున్నాయి. రోడ్లు ఎగుడు దిగుడు లతో, గుంటలతో, చిన్ని చిన్ని గుట్టలతో అందరూ ఊగుతున్నారు. పిల్లలు మాత్రం తమకి అరుదుగా దొరికే వాహన ప్రయాణాన్ని బాగా ఆనందిస్తున్నారు.

టెంపో డ్రైవర్ పక్కనే కూచున్న యాదగిరి – నర్సయ్యల చూపులు దూరంగా కనబడుతున్న పైపుల వైపు ప్రసరించాయి. ఏదో చూడరాని దృశ్యం చూసినట్టుగా అనిపించింది. నిద్రమబ్బేమో అనుకొని కళ్ళను నలుపుకొని కళ్ళని పెద్దవిగా చేసి పరీక్షగా చూసారు.

కాంతమ్మ తనతో వచ్చిన వారందరి సహకారంతో పార్కు దగ్గర కొత్తగా వెలిసిన మురికివాడ పాకల్లో ఉన్న వారందరిని లేపింది.

"మా పార్కులో స్థలం ఖాళీ అయ్యింది. మీరంతా ఇప్పటికిప్పుడే ఖాళీ చేసి వెంటనే వచ్చేయండి. తెల్లారేసరికల్లా ఎప్పటిలాగే నిండుగా ఉండాలి. ఆలస్యం వద్దు." తనమాటలతో అందరిని అప్పటికప్పుడే పనిలోకి పురికొల్పింది కాంతమ్మ. అండగా ఉంటూ తోటివారి సహాయంతో పనులన్ని చకచకా చేయడానికి ప్రోత్సహించింది.

అందరి ముఖాల్లో సంతోషం. పార్కు పాకల్లో ఉన్నవారిది తమకంటే మెరుగు జీవితం. రాత్రికి రాత్రే ఇలాటి అవకాశం రావడాన్ని నమ్మలేకపోయారు. ఆలస్యం పనికిరాదని వెంటనే ఖాళీ చేసి పార్కులో ఖాళీ అయిన స్థలాన్ని నింపేసారు. మామూలు జనాలకి పార్కు ఎప్పటిలాగానే ఉంది. మనుషులు మారారు. అంతే !

కాంతమ్మ ముఖంలో ఎంతో సంతృప్తి. పార్కులో తమ 'ఉమ్మడి కుటుంబం'లో మనుషులు మారినా సైజు మాత్రం తగ్గనందుకు ఏదో గొప్ప విజయాన్ని సాధించానన్న తృప్తి.... నోట్లో నిండిన ఉమ్మిని తుపుక్కున బయటకు చిమ్మింది. అది ఎరుపురంగు గీతలా పడింది.

కళ్ళను బాగా పులుముకొని చూసినా దూరంగా కనబడుతున్న దృశ్యంలో ఎలాటి తేడా కనిపించలేదు. యాదగిరి – నర్సయ్యల గుండెల్లో ఏదో గుబులు. పిరికితనం సర్రున శరీరాలనిండా ప్రాకిపోయింది. డ్రైవర్ఎక్సిలరేటర్ని మరికొంత నొక్కాడు.

యాదగిరి – నర్సయ్యలకి కనిపించింది పైపుల దగ్గర జనం. హడావుడిగా తిరుగుతున్న జనం. అక్కడ దింపిన సామాన్లని ఎవరిది వారు తీసుకొంటూ పైపుల్లోకి రవాణా చేస్తున్నారు. వాళ్ళ గుంపులో లీడర్లు కాబోలు అక్కడక్కడ నిల్చొని ఒక్కో కుటుంబానికి పైపుని కేటాయిస్తున్నారు.

"నువ్వటు... నీవిటు... నీది ఆ వైపు... నువ్వు ఈ వైపు..."

అలాట్‌మెంట్ అవగానే జనం తమ సామాన్లని విప్పి తమకు తోచిన రీతిలో కొత్త ఆకారానికి అనుకూలంగా అమర్చుకొంటున్నారు.

వంకరగా పడి ఉన్న పైపుల్ని నిదానంగా చేసుకొని అవి కదలకుండా ఉండేట్టుగా రెండువైపులా చిన్న చిన్న రాళ్ళని పెట్టుకొంటున్నారు.. కొత్త లోకం... కొత్త ఆకారాల్లో నివాసం. ఎక్కడి నుండి, ఎలాటి స్థితిలోంచి వచ్చారో తెలియదు కాని వారి మొహాల్లో ఒక మెట్టు పైకి ఎక్కామన్న ఆనందం స్పష్టంగా కనబడుతోంది. పండగ వాతావరణంలా ఉంది. పిల్లలు పైపుల మధ్య వింతగా, సంతోషంగా అటూ ఇటూ పరుగెడుతున్నారు.

అన్ని చక్రాలు ఆగాయి. జనమంతా ఒకచోట గుమిగూడారు. ఆందోళనగా ఉన్నారు. అందరిదృష్టి పైపుల్లో సామాన్లని సర్దుకొంటున్న వారిపైన ఉంది.

"నేననుకున్న... ఇలాటిదేదో జరుగుతుందని..." ఒకరు గొంతు విప్పారు.

"ఈ యాదగిరిగాడు ఏపని చేసినా ఇంతే!.." ఇంకొకరు.

"మనం కాంతక్క మాట వినాలిసి ఉండేది.." మరొకరు.

"పోలీసోల్లు అడ్డుకోకుంటే ఈ పాటికి మనం పైపుల్లో ఉండేవాళ్ళం. మన దురదృష్టం....."

ఎవరికి తోచిన రీతిలో వారు మాట్లాడుతున్నారు..... కొందరు పిరికిగా..... కొందరు మొండి ధైర్యంతో....

"అన్నా... మనం వెళ్ళి వాళ్ళతో మాట్లాడుదాం. సగం పైపుల్ని మనకి ఇయ్యమందాం... మనం నిన్న చూసి పోయామని చెబుదాం.... రావడంలో కొంచెం ఆలస్యమయ్యింది. అంతే !" సలహా ఇచ్చారొకరు.

"టీమ్ ఇండియా" సైజు పెరిగింది. అందరిని అక్కడే ఉండమని చెప్పి ముందుకు కదిలింది 'టీమ్ ఇండియా'.

డ్రైవర్లు, రిక్షావారు అరగంటలో సామాన్లని ఖాళీ చెయ్యకపోతే డబుల్ ఛార్జీ చేస్తామని బెదిరించారు. అప్పటికే చాలాఆలస్యం అయ్యిందని, ఆరోజుటి వ్యాపారం దెబ్బ తింటుందని గట్టిగా అన్నారు.

వస్తున్న గుంపును చూసి పైపుల దగ్గరున్న వారు మరో 'టీమ్ ఇండియా'ని క్షణాల్లో తయారు చేసారు. పొజిషన్ తీసుకొన్నారు.

రెండు టీముల పోటీ... ఫేస్‌టు ఫేస్....

ఫాస్ట్ బౌలింగులు, స్పిన్ మాజిక్కులు, రివర్స్ స్వింగులు, దూస్రాలు, తీస్రాలు...ఒకటేమిటి అన్ని రకాల విసుర్లు...పరుగులు....వికెట్లు లేని పరుగులు..

పార్కు నుండి వెళ్ళిన 'టీమ్ ఇండియా దేంట్లోను తమ ప్రతిభను చూపలేకపోయింది.

ఒక గంట ముందు చేరిన పైపుల 'టీమ్ ఇండియా'కి స్థానబలం తోడయ్యింది. నీటిలో ఉన్న మొసలి బలంలా పని చేసింది.

పార్కు 'టీమ్ ఇండియా' ఆటగాళ్ళకి దెబ్బలు తగిలాయి. కొందరికి రక్తం కారింది. మొహాలపై వాపులు.... బాధగా మూలుగుతున్నారు.

"పాత చోటికే పద...." యాదగిరి నోటి నుండి కష్టంగా వచ్చాయి మాటలు.

డ్రైవర్లు అసహనంగా ఉన్నారు. డబుల్ చార్జీలు ఇస్తేనే వస్తాం అని మొండికేసారు.

"సరే... పద..."

మళ్ళీప్రయాణం.....

పిల్లలు మాత్రం సంతోషంగా ఉన్నారు. వాహనాల్లో వారి ప్రయాణం ఇంకా కొనసాగుతున్నందుకు......

హాస్యచినుకులు శీర్షికలో
ప్రచురణకు ఆరోగ్యమైన హాస్యాన్ని
పండించే జోకులకు ఆహ్వానం